క్లుప్తంగా

20న ప్రత్యేక విద్యుత్ అదాలత్

మదనపల్లె : మదనపల్లె డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సీటీఎంరోడ్డులోని డివిజన్ ఆఫీస్‌లో 20వ తేదీ, గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఈఈ యుగంధర్ తెలిపారు. మంగళవారం ఈఈ కార్యాలయం విడుదల చేసిన పత్రికాప్రకటనలో...గురువారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు సీజీఆర్‌ఎఫ్ అధ్యక్షులు వి.శ్రీనివాస ఆంజనేయప్రసాద్ ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్ జరుగుతుందన్నారు. డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.

3,430 బ్యాగులు మంజూరు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా బ్యాగులు మంజూరైనట్లు ఎంఈఓ-టూ గౌస్‌పీర్ మంగళవారం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టూడెంట్ కిట్‌లో భాగంగా ఇప్పటికే పాఠ్య, నోటు పుస్తకాలు మంజూరు కాగా మంగళవారం 3,430 బ్యాగులు మండల కేంద్రానికి వచ్చాయన్నారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు బ్యాగులను అందజేస్తామని గౌస్‌పీర్ తెలిపారు.

వాహనాల వేలం

ములకలచెరువు: ములకలచెరువు ఎస్‌ఈబీ పరిధిలో గతంలో అధికారులు చేపట్టిన తనిఖీల్లో పలు వాహనాలు పట్టుబడ్డాయి. ఈ నేపథ్యంలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక ఎస్‌ఈబీ కార్యాలయం వద్ద వివిధ కేసుల్లో పట్టుబడిన 16 వాహనాలకు ఈఎస్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐ రాంమోహన్ వేలం నిర్వహించారు.

ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా రామాంజనేయులు

పెద్దతిప్పసముద్రం: భారతీయ జనతా పార్టీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా మండలంలోని మల్లెల గ్రామానికి చెందిన బోడంపల్లి రామాంజనేయులు నియమితులైనట్లు బీజేపీ జిల్లా కార్యదర్శి మల్లెం శివయ్య తెలిపారు. ఈ మేరకు రాజంపేట పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జ్ సాయి లోకేష్ ద్వారా మంగళవారం నియామక పత్రం అందుకున్నట్లు మల్లెం శివయ్య పేర్కొన్నారు.

20 నుంచి మహాభారత మహోత్సవం

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలో ఈనెల 20 నుంచి మహాభారత మహోత్సవం నిర్వహిస్తున్నట్లు కమిటీ నిర్వాహకులు వెంకటేష్, రామచంద్రనాయుడు తెలిపారు. 19న అంకుర్పారణ, నవగ్రహ కలశారాధన,నవగ్రహ హోమం, గణపతిహోమం, ధ్వజారోహణంతో ప్రారంభమవుతుందన్నారు. 20 నుంచి ప్రముఖ భాగవతారిణి జ్యోత్స్నచేత హరికథ, రాత్రి నాటక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. మహాభారత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

వీఓ రికార్డులు ఆడిట్

పెద్దమండ్యం: స్థానిక వెలుగు కార్యాలయంలో గ్రామైఖ్య సంఘాల రికార్డులను మంగళవారం ఆడిట్ నిర్వహించారు. డీఎంజి మల్లయ్య పర్యవేణలో గ్రామైఖ్య సంఘాలలో ఉన్న నగదు వివరాలు, అప్పులు, తిరిగి చెల్లింపులు రికార్డులను ఆడిట్ నిర్వహించారు. సెర్ప్ ఆధ్వర్యంలో సత్యసాయి జిల్లా కదిరికి చెందిన ఆడిటర్‌లు రికార్డులకు ఆడిట్ చేశారు. ఆయా గ్రామైఖ్య సంఘాల పరిధిలోని సీసీలు, సంఘమిత్రలు ఆడిట్ అధికారులకు రికార్డులను చూపించారు. ఈకార్యక్రమంలో సీసీలు శ్రీనివాసులు, సుబ్బరామయ్య, మైసూరు రమణయ్య, సంఘమిత్రలు పాల్గొన్నారు.

'నేను బడికి పోతా' విజయవంతం చేయాలి




'నేను బడికి పోతా' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

గుర్రంకొండ: నేను బడికి పోతా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ జగదీశ్వర్ రెడ్డి, ఎంఈఓ సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా 'నేను బడికి పోతా' పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 13 నుంచి జూలై 12 వరకు ఈ కార్యక్రమం నిర్వహించాల్సి ఉంటుందన్నారు. సుమారు నెలరోజుల పాటు పకడ్బందీగా బడి బయట పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. అన్ని శాఖల అధికారులు సమష్టిగా పనిచేసి విజవంతం చేయాలన్నారు. సమావేశంలో ఎంఈఓ సురేంద్రబాబు, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

20న డయల్ యువర్ డీఎం

రాజంపేట: ఈ నెల 20న డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణీకులు ఏమైనా సమస్యలు ఉంటే 9959225775 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఆర్టీసీ సౌకర్యాలను ప్రయాణీకులు సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

కమనీయం.. శ్రీ లక్ష్మీనరసింహుడి కల్యాణం



లక్ష్మీనరసింహుడి కల్యాణోత్సవం నిర్వహించిన అర్చకులు



కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణోత్సవం కనుల పండుగగా జరిగింది. మంగళవారం స్వాతి నక్షత్రం కావడం, ఇదేరోజు స్వామివారి జన్మదినం కావడంతో టీటీడీ ఆధ్వర్యంలో స్వామివారికి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో చలువపందిళ్లు, పచ్చని తోరణాలతో పెళ్లివేదికను అందంగా అలంకరించారు. ముందుగా మూలవర్లకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామునే స్వామివారికి పాలతో క్షీరాభిషేకం నిర్వహించారు. పంచామృతాలకు ప్రత్యేకంగా మూలవర్లకు అభిషేకాలు కావించారు. రంగురంగుల పుష్పాలతో స్వామివార్లను అలంకరించిన తీరు అందర్ని అకట్టుకొంది. ముత్యాల తంబ్రాలతో స్వామివారి పెళ్లివేడుక నిర్వహించారు. వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య మేళతాళాలతో శాస్త్రోక్తంగా మాంగల్యధారణ కావించారు. కల్యాణోత్సవం సందర్భంగా స్వామివారి ఎదుట యజ్ఞహోమాలు నిర్వహించారు. రూ.300 చెల్లించి కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులకు టీటీడీ వారు పట్టువస్త్రాలు, కంకణాలు, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పెద్ద ఎత్తున భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారిని సేవించుకొన్నారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

లోతట్టు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన



శ్రీకృష్ణ కల్యాణ మండపం వద్ద మోరీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : వర్షం కారణంగా పట్టణంలో ముంపునకు గురైన లోతట్టు ప్రాంతాలను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మంగళవారం పరిశీలించారు. పట్టణంలోని పీఅండ్‌టీ కాలనీ ట్యాంక్ కిందవైపు కురవంక ఏరియాలోని లోతట్టు ప్రాంతాల్లో పర్యటించారు. దాదాపు 25 ఇళ్లలో 4–5 అడుగుల మేర నీరు నిలిచిపోవడాన్ని గమనించారు. రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభం కారణంగా, చెత్త పేరుకుపోయి, మురుగునీరు వెళ్లలేకపోవడంతో ఇంట్లోకి నీరు వచ్చినట్లు స్థానికులు తెలిపారు. దీంతో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, విద్యుత్, మున్సిపల్, సచివాలయ సిబ్బందిని యుద్ధప్రాతిపదికన పనిచేసి, ప్రజల ఇబ్బందులు తొలగించాల్సిందిగా ఆదేశించారు. అనంతరం శ్రీకృష్ణ కల్యాణ మండపం ఎదురు తాళ్లవారి వీధిలో చాలాకాలంగా మురుగు నిల్వ ఉండటంపై, మున్సిపల్ కమిషనర్ కే.ప్రమీల, డీఈ శిరీషలకు తక్షణం చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేసి, కాల్వల్లో పూడికలు తీయించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

విద్యాసంస్థలపై చర్యలకు డిమాండ్



ఎంఈఓ ప్రభాకరరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న బీవైఎస్ అధ్యక్షులు పునీత్ తదితరులు

మదనపల్లె : విద్యను వ్యాపారంగా మార్చి, తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని బహుజన్ యువసేన అధ్యక్షులు పునీత్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎంఈఓ ప్రభాకరరెడ్డిని కలిసి, పట్టణంలో తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్న విద్యాసంస్థలపై వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పునీత్ మాట్లాడుతూ.. పిల్లలకు మంచి భవిష్యత్తును అందించాలన్న తల్లిదండ్రుల కోరికను ఆసరాగా తీసుకుని, పట్టణంలో ప్రైమరీ, ప్రీ స్కూల్స్, కిడ్స్ జోన్స్ పేర్లతో పాఠశాలలు ప్రారంభించారన్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఎల్‌కేజీకి రూ.35వేల నుంచి 50వేల రూపాయలు ఫీజుల రూపంలో వసూలుచేస్తున్నారన్నారు. ఇవేకాకుండా స్నాక్స్, ఆక్టివిటీస్ పేరుతో వేలకు వేల రూపాయలు దోపిడీ చేస్తున్నారన్నారు. ఇలాంటి పాఠశాలల్లో టీటీసీ, బీఈడీ పూర్తి చేసిన సర్టిఫైడ్ టీచర్స్ లేకపోగా, ఇంటర్, డిగ్రీ చదివిన వారితో చదువులు చెప్పిస్తూ మోసానికి పాల్పడుతున్నారన్నారు. పాఠశాలల్లో యూనిఫామ్, స్టేషనరీ అమ్మవద్దని ప్రభుత్వం నిబంధనలు పెట్టినా, బేఖాతరు చేస్తూ అధిక ధరలకు అమ్ముకుంటూ, సొమ్ములు చేసుకుంటున్నారన్నారు. కార్పొరేట్ అని గొప్పలు చెప్పుకునే పాఠశాలల్లో ప్లే గ్రౌండ్, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్ వసతులు లేవన్నారు. ఫైర్ సేఫ్టీ మెజర్స్ పాటించడం లేదన్నారు. విద్యాశాఖ అధికారులు ఇలాంటి పాఠశాలలపై దృష్టిసారించి, ప్రభుత్వ నిబంధనల మేరకే నడుచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆయా విద్యాసంస్థల ఎదుట తల్లిదండ్రులతో కలిసి నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బహుజన యువసేన నాయకులు హరీష్, శశికుమార్, పూర్ణ, జగదీష్, వినయ్, సందీప్, సాయికిషోర్, సాదిక్, వంశీ, శశి పాల్గొన్నారు.

నడివీధి గంగమ్మ జాతర చాటింపు



నెహ్రూబజార్‌లో ప్రతిష్టించిన నడివీధి గంగమ్మ

మదనపల్లె : స్థానిక నెహ్రూబజార్ నాలుగు రోడ్ల కూడలిలో మంగళవారం నడివీధి గంగమ్మను ప్రతిష్టించారు. ఎంతో పేరుప్రతిష్టలు కలిగిన నడివీధి గంగమ్మ జాతర ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి ఘనంగా నిర్వహిస్తారు. బాకావానితోపుకు చెందిన కుమ్మరి కులస్తులు తయారు చేసిన అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చి ప్రతిష్టించారు. అమ్మవారికి పూజలు చేశారు. ఈనెల 25న రాత్రి, 26న పగలు జాతర నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా మహమ్మారమ్మ గంగజాతర

స్థానిక ఎస్‌బిఐ కాలనీలో మంగళవారం మహమ్మారమ్మ గంగజాతర ఘనంగా జరిగింది. మహిళలు అమ్మవారికి దీలు, బోనాలు సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. జాతర పురస్కరించుకుని ఆలయాన్ని రంగు రంగు విద్యుత్ దీపాలతో అలంకరించారు.భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండాలి



మలేరియా మాసోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పీలేరు : మలేరియా వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య అన్నారు. మంగళవారం తలపుల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మలేరియా వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా సోకిన వ్యక్తి సకాలంలో చికిత్స పొందకపోతే ప్రాణాంతకమని తెలిపారు. చలితో కూడిన జ్వరం, చెమట పట్టడం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు, కడుపునొప్పి, వాంతులు, వికారం తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. అపరిశుభ్రమైన పరిసరాలు, నీటి నిల్వలలో దోమలు వృద్ధి చెంది మలేరియా వ్యాప్తికి దోహదపడుతాయన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టు



కొమ్మిరెడ్డిగారిపల్లె వద్ద దెబ్బతిన్న కల్వర్టు

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె-వాల్మీకిపురం మార్గంలో కొమ్మిరెడ్డిగారిపల్లె సమీపంలో బాహుదా ఏటిపై నిర్మించిన కల్వర్టు ఇటీవల వర్షాలకు సగానికిపైగా దెబ్బతింది. దీంతో ఆ మార్గంలో వెళుతున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ప్రాజెక్ట్ గేట్లు ఎత్తినప్పుడు నీటి ప్రవాహ ఉధృతితో కల్వర్ట్ కొంతమేర దెబ్బతినగా, ప్రస్తుతం వర్షాలకు మరింత పాడవడంతో స్థానికుల్లో ఆందోళన నెలకుంది. నీటిప్రవాహం పెరిగితే పూర్తిగా పాడై రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందని, అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. అంతేకాకుండా బాహుదా గేట్లు ఎత్తినప్పుడు వాహనాల రాకపోకలు ఈ మార్గంలో పూర్తిగా నిలిచిపోతున్నాయి. కల్వర్టు స్థానంలో బ్రిడ్జి నిర్మించాలని చాలాకాలంగా స్థానికులు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరుతున్నారు. అయితే ఇప్పటికే అగ్రహారం, నిమ్మనపల్లెలో బ్రిడ్జిల నిర్మాణం పూర్తైంది. వాల్మీకిపురంకు రాకపోకలు సాగించేందుకు ఈ బ్రిడ్జి నిర్మాణం ఎంతో అవసరం ఉందని, అధికారులు చర్యలు చేపట్టాలని అంటున్నారు.

ఎన్‌డీఏ కూటమితో బీజేపీ ఓటుబ్యాంకు పెంపు



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివనారాయణ

మదనపల్లె : ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌డీఏ కూటమితో కలిసి పోటీచేసినందున బీజేపీ ఓటుబ్యాంకు గణనీయంగా పెరిగిందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జోనల్ ఇన్‌చార్జ్ బిట్రశివనారాయణ అన్నారు. మంగళవారం పట్టణంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు సాయి లోకేష్ ఆధ్వర్యంలో బీజేపీ రాజంపేట పార్లమెంట్ జిల్లా ఎన్నికల సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బిట్ర శివనారాయణ మాట్లాడుతూ..రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీని ప్రజలు ఆదరించారని, రాజంపేట పార్లమెంట్ పరిధిలో దాదాపు 1,40,000 ఓట్లు గతంలో కంటే పెరగడం శుభపరిణామమన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పరిపాలనా విధానం, చంద్రబాబు పాలనాదక్షత, పవన్‌కల్యాణ్ నిజాయితీని స్వాగతిస్తూ, ఎన్‌డీఏ కూటమిని ప్రజలు బలపరిచారన్నారు. కూటమికి ఓటువేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుకుంటూ, వారి ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందిస్తామన్నారు. కొన్ని ప్రత్యేక కారణాలతో, తక్కువ ఓట్లతో రాజంపేట పార్లమెంట్ స్థానం కోల్పోయినప్పటికీ, బీజేపీ కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. జిల్లా బీజేపీ అధ్యక్షులు సాయిలోకేష్ మాట్లాడుతూ...కార్యకర్తల సమస్యలను పరిష్కరించి, పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా రాజంపేట పార్లమెంట్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా సమీక్ష నిర్వహించి, కార్యకర్తల అభిప్రాయాలను సేకరించారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ ఇన్‌చార్జ్ చంద్రమౌళి, నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జ్ పి.రమేష్‌నాయుడు, స్టేట్ కోఆపరేటివ్ సెల్ కన్వీనర్ గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు ఆకులకృష్ణమూర్తి, యల్లంపల్లెప్రశాంత్, కృష్ణయాదవ్, ఆనందగజపతిరాజు, ఓసూరికిరణ్, షబ్బీర్‌అహ్మద్, బాలజ్యోతి, పచ్చిపాలవసంత్‌కుమార్, బండిఆనంద్, జర్మన్‌రాజు, బరినేపల్లె రవికుమార్, పూలనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి లేని సమాజమే లక్ష్యం



గుర్రంకొండలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది

గుర్రంకొండ: క్షయవ్యాధి(టీబీ) లేని సమాజమే లక్ష్య సాధన కోసం వయోజన బీసీజీ టీకాలను భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిందని జిల్లా ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్‌రఫీక్, వాల్మీకీపురం టీబీ యూనిట్ పర్యవేక్షులు నాగిరెడ్డి అన్నారు. మంగళవారం గుర్రంకొండలోని కొత్తపేట, ఇందిరమ్మకాలనీలలో బీసీజీ టీకాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో టీబీ రాకుండా ముందస్తు నివారణ చర్యల్లో భాగంగా ప్రభుత్వం టీకాలను ప్రవేశపెట్టిందన్నారు. వయోజనా టీకాలు మరణాల తీవ్రతను నివారించడానికి ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ప్రతివారంలో సోమ, గురువారల్లో స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో పెద్దలకు బీసీజీ టీకాలు వేస్తారన్నారు. టీబీకి వ్యతిరేకంగా మనిషి రోగనిరోధక శక్తిని మరింత పెంచడానికి ఉపయోగపడతాయన్నారు. బీసీజీ టీకాలు ఎటువంటి అనుమానాలకు తావులేకుండా వేసుకోవచ్చన్నారు. 60 సంవత్సరాలు వయస్సు పెబడ్డవారు, పోగపీల్చువారు, మధుమేహ వ్యాధిగ్రస్తులు, టీబీ జబ్బుతో కోలుకొన్నవారు, వారి కుటుంబ సభ్యులు టీకాలు వేసుకోవడానికి అర్హులన్నారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని టీబీ వ్యాధిని తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి రవీంద్రనాయక్, సీహెచ్‌వో సీతారామయ్య, సూపర్‌వైజర్ నాగరాజు, ఎల్.హెచ్‌పీ చందన, ఏఎన్‌ఎంలు జయలక్ష్మీ, రెడ్డివాణి, ఆరోగ్యసిబ్బంది, ఆశా వర్కర్లు, పాల్గొన్నారు.

522 మందికి బీసీజీ వ్యాక్సిన్

తంబళ్లపల్లె: వైద్య ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షయ వ్యాధిని నివారించేందుకు ముందస్తుగా చేపట్టిన బీసీజీ వ్యాక్సిన్ ప్రత్యేక కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. మండలంలోని 12 హెల్త్‌క్లినిక్ పరిధిలో 522 మందికి బీసీజీ వ్యాక్సిన్ ఇచ్చినట్లు కోసువారిపల్లె పీహెచ్‌సి డాక్టర్ మునికుమార్ తెలిపారు. ఇప్పటి వరకు 2,592 మందికి వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. అనంతరం పంచాలమర్రిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించి పలువురికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

ఉరుస్తున్న తహసీల్దార్ కార్యాలయం



ఉరుస్తున్న తహసీల్దార్ కార్యాలయం



కార్యాలయం బయట ఆరబెట్టిన రికార్డులు

పెద్దమండ్యం: పెద్దమండ్యం తహసీల్దార్ కార్యాలయం ఉరుస్తోంది. సోమవారం రాత్రి కురిసిన ఓ మోస్తరు వర్షానికి కార్యాలయంలో ఉన్న గదులు ఉరుస్తుండడంతో అధికారులు కూర్చొనేందుకు ఇబ్బందులు పడ్డారు. ఉరిసిన నీళ్లతో కార్యాలయంలోని హాలులో నీరు నిలిచిపోయింది. అలాగే పలు రికార్డులు తడిసి పోయాయి. ఉరిసి హాలులో నిలిచిపోయిన నీటిని వీఆర్‌ఏలు తొలగించారు. అలాగే తడిసిపోయిన రికార్డులను కార్యాలయం ముందు ఆరబెట్టారు. ఓ మోస్తరు వర్షం పడితే చాలు కార్యాలయం మొత్తం తడిసి ముద్దవుతోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తహసీల్దార్ కార్యాలయం మరమ్మతులు చేయించాల్సి ఉంది.

● కలువ పూల కనువిందు



పచ్చగా పరుచుకున్న ఆకులు.. వాటిపై రాలిన ముత్యాలాంటి నీటి బిందువులు. నీటి నుంచి నిటారుగా నిలిచిన కాండంపై సిగ్గులొలికే మొగ్గలు, విప్పారిన పుష్పాలు. అలాంటి ఇలాంటి పూలు కాదు దేవతా పుష్పాలు. ఆ పూలు..తామరలు. చూపరులను ఆకట్టుకునే అందం వాటి సొంతం. పూలంటే సున్నితం. తామర పూలు మరీ సున్నితం. ఇది జాతీయ పుష్పం కూడా. మదనపల్లె మండలం సీటీఎం చెరువులో తామర మడుగులో తామర పుష్పాలు కనువిందు చేస్తున్నాయి. ఈ పుష్పాలు చూపరును ఆకట్టుకుంటుంది. - మదనపల్లె సిటీ

పీఎం కిసాన్ నిధులు విడుదల

నిమ్మనపల్లె : పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన పథకం కింద మండలంలోని రైతుల బ్యాంకు ఖాతాలకు నిధులు విడుదలైనట్లు ఏఓ మురళీమోహన్ తెలిపారు. మంగళవారం పీఎం కిసాన్ సమ్మాన్‌నిధి యోజన నిధుల విడుదల సందర్భంగా మండలంలోని అన్ని ఆర్‌బీకే కేంద్రాల్లో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రసంగాన్ని రైతులు ప్రత్యక్షంగా వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. పీఎం కిసాన్ 17వ విడత కింద 6,042 మంది అర్హులైన రైతులకు రూ.1.20 కోట్లు, ఒకొక్కరి ఖాతాలో రూ.2వేల చొప్పున జమ చేశామన్నారు.

ఘనంగా రౌద్రాల అంకాలమ్మ ఊరేగింపు



అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం

పీలేరు రూరల్ : స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలో వెలసిన శ్రీ రౌద్రాల అంకాలమ్మ గంగజాతరలో భాగంగా మంగళవారం రాత్రి అమ్మవారి ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం ఐదవ వారం గంగజాతర ఘనంగా నిర్వహించారు. పలువురు భక్తులు అమ్మవారికి బోనాలు ఊరేగింపుగా తీసుకొచ్చి మొక్కులు చెల్లించారు. రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని శోభాయమానంగా అలంకరించి మంగళవాయిద్యాల నడుమ పట్టణంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

దివ్యాంగ పిల్లలను భవిత కేంద్రానికి పంపాలి



మాట్లాడుతున్న సహిత విద్య ఉపాధ్యాయులు

మదనపల్లె సిటీ: దివ్యాంగ పిల్లలను భవిత కేంద్రాలకు పంపాలని భవిత కేంద్రం సహిత విద్య ఉపాధ్యాయులు ఎ.నాగేంద్రప్రసాద్, రెడ్డమ్మ తెలిపారు. మంగళవారం స్థానిక భవిత కేంద్రంలో విద్యార్థుల తల్లిదండ్రులతో నేను బడికిపోతా కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వంచారు. వారు మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ, స్పీచ్‌థెరపీ, ప్రత్యేక విద్య అందిస్తున్నట్లు పేర్కొన్నారు. భవిత కేంద్రానికి వచ్చే పిల్లలకు ప్రయాణ భత్యం నెలకు రూ.300 అందజేయడం జరుగుతుందన్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైన దివ్యాంగ పిల్లలకు చికిత్సలు ఉచితంగా చేయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచితంగా హిందీ స్టడీ మెటీరియల్స్

పుల్లంపేట: ప్రేమ్ చంద్ హిందీ భవన్ సొసైటీ, రాజంపేట వారి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి అభ్యసిస్తున్న విద్యార్థులకు సొసైటీ వ్యవస్థాపకుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ ఉచితంగా హిందీ స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘురాం మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా హిందీ స్టడీ మెటీరియల్ అందజేయడం సంతోషకరమన్నారు. సొసైటీ వ్యవస్థాపకుడు సయ్యద్ సర్తాజ్ హుస్సేన్ మాట్లాడుతూ ఇక్కడ హిందీ ఉపాధ్యాయుడు లేరని, స్టడీ మెటీరియల్ ఇస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని భావించి ఉచితంగా అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామిరెడ్డి, గంగాధర్ , ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

చల్లంగ చూడు.. గాలివీటమ్మా

గాలివీడు : గాలివీటమ్మా.. చల్లంగ చూడు తల్లీ అంటూ భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కొంగు బంగారంగా కోరిన కోర్కెలు తీర్చే గాలివీటమ్మ జాతర మంగళవారం వైభవంగా ముగిసింది. మండల కేంద్రంలోని కుషావతి నదీ తీరాన వెలసిన శ్రీ గాలివీటి గంగమ్మ జాతర అత్యంత వైభవోపేతంగా జరిగింది. సోమవారం సద్దల కూడు నైవేద్యంతో ప్రారంభమైన జాతర విశేష పూజలతో ప్రత్యేక అలంకరణ నడుమ నిండు తిరునాలగా మారింది. మంగళవారం ఉదయం మహిళలు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్దగొడుగు స్వామి తిరునాలలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

ముగిసిన నాగారపమ్మ జాతర

సుండుపల్లె: మండల కేంద్రంలోని పెదనేని కాలువ గ్రామ పంచాయతీ బండకాడ ఈడిగపల్లెలో వెలసిన శ్రీ నాగారపమ్మ తల్లి జాతర మహోత్సవం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి మొక్కు తీర్చుకున్నారు.